సచివాలయ నిధులు.. అభివృద్ధికి బాటలు

- సత్ఫలితాలిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం
- సచివాలయాలకు మంజూరైన నిధులతో సిమెంట్ రోడ్లు
- 15 సచివాలయాలకు రూ.3 కోట్లు
- గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు వినియోగం



నూతనంగా నిర్మించిన సీసీ రహదారి

విస్సన్నపేట: సచివాలయాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ప్రాధాన్యతా క్రమంలో గుర్తించిన పనులు చక చకా సాగుతున్నాయి. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించింది.

మండలానికి రూ.3 కోట్లు..

మండలంలో 15 గ్రామ సచివాలయాలకు రూ.3 కోట్లు కేటాయింపు జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని రోడ్ల పరిస్థితిపై ఆరా తీశారు. మండలంలోని నరసాపురం గ్రామంలో సీసీ రహదారులు కావాలని గ్రామస్తులు స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నరసాపురం గ్రామంలో రెండు సచివాలయాల పరిధిలో రూ.40 లక్షల నిధులతో తొమ్మిది సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనుల్లో భాగంగా గుర్తించిన ఏరియాలలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మండలంలో మిగతా 13 సచివాలయాల పరిధిలో అవసరమైన ఏరియాలో పనులు గుర్తించి నూతనంగా సీసీ రోడ్లు నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. గతంలో సీసీ రహదారుల కోసం ఎన్ని అర్జీలు పెట్టినా అవని పనులు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లడంతో సీసీ రహదారుల నిర్మాణం జరిగిందని స్థానికులు సంతోషం వ్యక్త పరుస్తున్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం



సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించగా నరసాపురంలో అవసరమైన ఏరియాలలో రూ.40 లక్షలతో సీసీ రహదారులు నిర్మాణం పూర్తి చేశాం. మిగతా సచివాలయాల్లో పనులు గుర్తించాల్సి ఉంది. మరో రూ.35 లక్షలకు ఐదు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేస్తాం

– పి.దైవసహాయం, పీఆర్ ఏఈ, విస్సన్నపేట

గిరిజనుల అభ్యున్నతికి కృషి

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



ఓగిరాల తండాలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

నూజివీడు: దేశంలోనే తొలిసారిగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు అన్నారు. మండలంలోని ఓగిరాల తండాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చైర్మన్ వద్ద తమ సమస్యలను చెప్పుకున్నారు. అనంతరం కుంభా రవి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం గిరిజనుల కోసం మెడికల్ కాలేజీ ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.15700 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గిరిజనులకు రూ.2 వేల కోట్లు వెచ్చించి గృహాలను నిర్మిస్తోందని, గత ప్రభుత్వాలేవీ గిరిజనులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎస్టీ కమిషన్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క గిరిజనుడికి తప్పనసరిగా అటవీహక్కుల చట్టం ప్రకారం సాగు పట్టాలు ఇవ్వాల్సిందేనన్నారు. అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయం లోపం వల్లనే గిరిజనులకు చాలా ప్రాంతాల్లో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఓగిరాల తండాకు సంబంధించి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు తప్పనిసరిగా పట్టాలు ఇప్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని తండాల్లో గిరిజన కుటుంబాలు ఎన్ని, వారి జనాభా ఎంత, రేషన్‌కార్డులు లేని వారెందరూ తదితర వివరాలను అడిగితే అధికారులు, సిబ్బంది ఎవరూ చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వండి..

విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, హౌసింగ్, గిరిజన సంక్షేమం తదితర శాఖల అధికారులెవరూ రాకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు చైర్మన్ సూచించారు. సర్పంచిలు భూక్యా రాణి, డోలా ప్రభాకర్, ఎంపీటీసీ దుర్గమ్మ, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఎంపీడీవో సుందరి, సబ్‌డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జేపీ సౌజన్య, ఎఫ్‌ఆర్‌వో కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4.26 లక్షల ఎకరాల భూ పంపిణీ

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో ఆదివాసులు, గిరిజనులకు అటవీహక్కుల చట్టం కింద 4.26 లక్షల ఎకరాల భూ పంపిణీ చేసినట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవి తెలిపారు. నూజివీడులో శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి లక్ష్యంతో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత హక్కు కల్పించారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవి సందర్శించారు. ట్రిపుల్‌ఐటీలోని విద్యావిధానం గురించి, ట్రిపుల్‌ఐటీలో ఉన్న ఎస్టీ విద్యార్థుల సంఖ్య, ఫ్యాకల్టీ సంఖ్యను తెలుసుకున్నారు.

క్లుప్తంగా

యోగా సాధన అలవర్చుకోవాలి



ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవర్చు కోవాలని వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేష్ బాబు అన్నారు. కొండపల్లి బీకాలనీలో శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులుశుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్య యోగా సాధనతో శారీరక మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ మహబాషా మాట్లాడుతూ నేడు అందరిలో ఆరోగ్య చైతన్యం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేస్తే ఆరోగ్యం మనచెంత ఉంటుందన్నారు. మార్చి 2వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని యోగా గురువు లంకే జనార్ధన్ తెలిపారు. నాగార్జున పాఠశాల విద్యార్థుల సూర్య నమస్కారాలు ఆకట్టుకున్నాయి.

వరిపైరులో కాలిబాటలు ఏర్పాటు చేయాలి



మునుకుళ్ళ(తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏడీఏ కెనడి మాట్లాడుతూ చిరుపొట్ట దశలో ఉన్న వరిపైరుకు గోధుమ రంగులోని సుడిదోమలు రసం పీలుస్తాయన్నారు. ఈ తెగులు వ్యాపించకుండా పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసి గాలి, వెలుతురు సోకే విధంగా చూడాలని తెలిపారు. సస్యరక్షణ చర్యలను వ్యవసాయశాఖ సూచనల మేరకు పాటించాలని తెలిపారు. ఏవో పద్మ, మాస్టర్ ట్రైనర్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

కొత్త రావిచర్లలో భూముల సర్వే



నూజివీడు: మండలంలోని కొత్తరావిచర్లలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని భూముల రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి. డ్రోన్ ద్వారా చేసే ఈ పనులను సర్పంచి కాపా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లావు నాగవరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది మాట్లాడుతూ గ్రామంలోని భూములను డ్రోన్ కెమెరా ద్వారా కచ్చితమైన సర్వే నిర్వహించి హద్దులు నిర్వహిస్తున్నామన్నారు. సర్వే పూర్తయిన రెండు, మూడు వారాల తర్వాత భూముల చిత్రపటాలు వస్తాయని ఆ చిత్రపటాలతో గ్రామ సర్వే బృందం గ్రామంలోని భూములను సర్వే చేస్తుందన్నారు. వీఆర్వో రవి, వైస్ సర్పంచి బెజవాడ సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల నుంచి మినహాయించాలి

తిరువూరు: తమను రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు బాధ్యతల నుంచి మినహాయించాలని పౌరసరఫరాల విభాగ వీసీ, ఎండీ వీరపాండ్యన్‌ను కోరినట్లు ఏపీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొల్లినేని రఘురాం తెలిపారు. సిబ్బంది కొరతతో పాటు సహకార సంఘాల్లో రుణాల మంజూరు, బకాయిల వసూలు తదితర విధుల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల విధులను నిర్వర్తించలేకపోతున్నామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరినట్లు వెల్లడించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ముత్యాలమ్మ చెరువు, ఎన్టీటీపీఎస్ రోడ్డు, ఆరు పంపుల సెంటర్, బ్యాంక్ సెంటర్ లలో పనులు నిర్వహించారు. ఆల్ఫా హోటల్ వద్ద పైప్‌లైన్ లీకవుతుండటంతో రిపేరు చేయించారు. జూపూడి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం పనులు జరిగాయి. పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు వీధుల్లో చెత్త శుభ్రం చేయించారు. డ్రెయినేజీల్లో సిల్ట్ తీయించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. సున్నం బ్లీచింగ్ చల్లించారు.

ఆర్థిక సాయం

ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి సొసైటీ సభ్యులు మృతి చెందితే తమ సహకార సంఘం తక్షణ సాయంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని కాట్రేనిపాడు వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజా వర ప్రసాద్ అన్నారు. ఇటీవల సంఘ సభ్యురాలు మందపాటి నాగమణి మృతి చెందడంతో ఆమె భర్త నాగరాజుకు సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10,000 అంతిమ సంస్కారాల కోసం తక్షణ సహాయాన్ని శుక్రవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కంబాల రాంబాబు, నేతలు బొబ్బా చెంచారావు, దావులూరి నాని, సొసైటీ కార్యదర్శి యేషయా, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

డీపీఓ మల్లికార్జునరావు



మాట్లాడుతున్న డీపీఓ జీవీకే మల్లికార్జునరావు

నూజివీడు: ఇంటి పన్నులను మార్చి నెలాఖరు నాటికి 100 శాతం వసూలు చేయాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీకే మల్లికార్జునరావు ఆదేశించారు. నూజివీడు డివిజన్‌లోని ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు, లింగపాలెం, చింతలపూడి మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులకు పలు అంశాలపై శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చినెల సమీపిస్తున్నా ఇంకా పలు పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు 40 శాతాన్ని మించలేదన్నారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించలేకపోతే కారణాన్ని అర్జీదారుడికి తెలిపి లేటర్ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, ముందు పంచాయతీల పరిధిలో వచ్చిన చెత్తను షెడ్ల వద్దకు తరలించి, వాటిని వేరు చేసి ఎరువు తయారు చేసుకోవాలన్నారు. సిబ్బంది సచివాలయం నుంచి పనివేళల్లో బయటకు వెళ్తుంటే ఆ విషయాన్ని మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డీఎల్పీవో వెంకటరత్నం, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ శిరీష, ఈవోపీఆర్డీ టీ సరస్వతి, డీఎల్‌పీవో కార్యాలయ ఏవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవలను గుర్తించే పదవులు

ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి



గంగాధరరావును సన్మానిస్తున్న పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ గంగాధరరావు సేవలు గుర్తించి ముఖ్యమంత్రి జగన్ ఆయనకు జిల్లా పదవిని కట్టబెట్టారని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జొన్నలగడ్డ గంగాధరరావును పార్టీ మండల అధ్యక్షుడు గర్నెపూడి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి జొన్నలగడ్డ గంగాధరరావు పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. పార్టీలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల సేవలను గమనించే ముఖ్యమంత్రి జగన్ పదవులు ఇస్తున్నారని, ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైస్ ఎంపీపీ షేక్ రహీమ్, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య కథనాలపై ఆగ్రహం



ఇబ్రహీంపట్నంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఈనాడు దిన పత్రిక ప్రతులు దహనం



మైలవరంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం చూసి తట్టుకోలేక అసత్య కథనాలు ప్రచురించిన ఈనాడు పత్రికపై వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలో ఈనాడు ప్రతులను పార్టీ నాయకులు శుక్రవారం దహనంచేశారు. పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి మాట్లాడుతూ గన్నవరంలో అల్లర్లకు కారణమైన టీడీపీ నాయకుడు పట్టాభిని పోలీసులు అదుపులోకి తీసుకుంటే పాత ఫొటోల కథనాలతో అల్లర్లకు మరింత ఆజ్యం పోసిన ఈనాడు పత్రికను బహిష్కరించాలన్నారు. అసత్యాలు రాసేందుకే ఈనాడు పత్రిక పుట్టిందని విమర్శించారు. దుర్గమ్మ ఆలయం పాలకవర్గం సభ్యుడు చింకా శ్రీనివాసరావు, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సచివాలయ కన్వీనర్ లంకే అంకమోహనరావు, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు, నల్లమోతుచిన్నయ్య,కౌన్సిలర్లు,నేతలు పాల్గొన్నారు.

మైలవరం: తప్పుడు కథనాలు ప్రచురించడం ఈనాడు పత్రిక ఇకనైనా మానుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నెపూడి వెంకట్రావు పేర్కొన్నారు. ఈనాడు దినపత్రిక తప్పుడు కథనాలనునిరసిస్తూ వైఎస్సార్ సీపీకార్యాలయం ఎదుట ఈనా డు దిన పత్రిక ప్రతులను తగులబెట్టారు. డౌన్ డౌన్ రామోజీ రావు అంటూ నినాదాలు చేశారు. సీఎమ్ జగన్ నాయకత్వం, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నాయకత్వం వర్ధిల్లాలని నినాధాలు చేశా రు. జోహార్ రామోజీ, జై జగన్, జై వసంత అంటూ నినాదాలు చేశారు. రామోజీ దిష్టి బొమ్మను దహనం చేశారు. వైఎస్సార్ సీపీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీ10 క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



కళాశాలలో టీ10 క్రికెట్ టీమ్‌తో లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి

మైలవరం: విజయవాడ రీజియన్ స్థాయిలో ద హిందూ ఫ్యూచర్ ఇండియా, విజ్ఞాన జ్యోతి సంయుక్తంగా నిర్వహించిన టీ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజయం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం ఎల్బీఆర్‌సీఈలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, బెస్ట్ బ్యాటర్ అవార్డులను సాయికిరణ్, బెస్ట్ బౌలర్ అవార్డును రామకృష్ణ అందుకున్నారన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకు విజయవాడలో జరిగిన రీజినల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయన్నారు. విద్యార్థులను, పీడీ రాజకుమార్ ను లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వాసవీ ఫార్మా ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రాధా మాధవ టింబర్ డిపో ఏరియా, ల్యాంకో కాలనీ, జీఐజీ స్కూల్ ఏరియా, రెడీ మిక్స్ ప్లాంట్, ఎండోమెంట్ ఆఫీస్, రావూరి చైతన్య ప్లాట్స్ ఏరియా, వెంకయ్య స్వామి టెంపుల్ ఏరియా, సాహితీ విల్లాస్ ఏరియా వరకు కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఇబ్రహీంపట్నం:స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు.డిపో పరిధిలో ప్రయాణికులు ఉదయం 11గంటల నుంచి 12 గంటల మధ్య 99592 25457 నంబర్‌కు తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు.

గోవధ నిషేధించాలని వినతి

తిరువూరు: పట్టణంలో గోమాంస విక్రయాలు నిషేధించాలని బీజేపీ నాయకులు శుక్రవారం విజయవాడ వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి భారతీ పవార్‌కు వినతిపత్రం సమర్పించారు. గోవధ చేస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి అధికారులకు తగు ఆదేశాలిస్తామని పేర్కొన్నట్లు బీజేపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మాధవరావు తెలిపారు.

1న రామాలయం ప్రతిష్ట

తిరువూరు: మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంలో నూతనంగా నిర్మించిన దాసాంజనేయ సహిత సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రతిష్టా కార్యక్రమం మార్చి 1న జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

పంట నమోదు చేసుకోవాలి

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ యశ్వంత్ పేర్కొన్నారు. ఈలప్రోలు గ్రామంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేసే యోచనలో కేంద్రం ఉందన్నారు. ఈ యేడాది నుంచి ప్రతి రైతు ఎకౌంట్‌లో రూ.8 వేలు జమచేస్తారని తెలిపారు. జిల్లా కార్యదర్శి కాజా కిరణ్, యుగంధర్ రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసన



ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



మైలవరం ర్యాలీలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్లకు రాయితీలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. నిత్యవసరాల ధరలు తగ్గించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్‌ఎస్ శ్రీనివాస్, కొండపల్లి కార్యదర్శి ఎం.మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

తిరువూరు: సామాన్య, మధ్యతరగతి వర్గాలపై అదనపు భారం మోపుతూ కేంద్రప్రభుత్వం పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆరోపిస్తూ తిరువూరు బోస్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. కార్పొరేట్ శక్తులకు ఉపయుక్తంగా ఉండే బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని, పేదలకు తీరని అన్యాయం చేస్తోందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. స్థానిక నాయకులు నాగేంద్రప్రసాద్, భద్రం, వెంకటేశ్వరరావు, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైలవరం: కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ మైలవరం బోసు బొమ్మ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌కు అన్యాయం చేస్తుందని, దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ.ఆంజనేయులు అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్, నాయకులు వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, సీహెచ్ సుధాకరరావు, కే దేవేంద్ర, సీహెచ్.రాజారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తోటమూల(గంపలగూడెం): కేంద్ర బడ్జెట్ తీరుపై సీపీఎం ఆధ్వర్యంలో తోటమూల వై జంక్షన్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పన చేసే ప్రాజెక్టులలో పెట్టుబడులను తగినంతగా పెంచాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి గువ్వల శీతారామిరెడ్డి, నాయకులు గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, కుటుంబరావు, వీరభద్రం, రామకృష్ణారెడ్డి, సత్యంబాబులు పాల్గొన్నారు.


మామిడి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో మామిడి తోటలను జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిపూత దశలో తేనెమంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, అవి రసం పీల్చి తేనె వంటి ప్రదార్థాన్ని విసర్జిస్తాయన్నారు. దాని మీద శిలింద్రాలు పెరిగి ఆకుల మీద మసి మంగు ఏర్పడి కిరణ జన్య సంయోగ క్రియ జరగక పూ మొగ్గను ఉత్పత్తి చేయలేదన్నారు. దీని నివారణకు అధికారుల సూచనల మేరకు తగు మోతాదుల్లో మందులను పిచికారి చేయాలని తెలిపారు. తోటల్లో కలుపు మొక్కలు, గడ్డి, ఎండు పుల్లలు, లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత సమయంలో తెలికపాటి తడి ఇచ్చి ఒక్కొక్క చెట్టుకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల పోటాష్ వేసుకోవాలని సూచించారు. నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాధారాణి, కీటక శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, మండల ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ వివిధ గ్రామ రైతులు పాల్గొన్నారు.

కోనేరు నిర్మాణానికి వితరణ

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేరు నిర్మాణానికి ఇరువురు భక్తులు శుక్రవారం రూ.1.05 లక్షల వితరణగా అందజేశారు. కొణిజెర్లకు చెందిన మోదుగు కృష్ణ, మునియమ్మ దంపతుల కుమారులు రవికాంత్, నరేంద్రకుమార్ ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరిగోపాలచార్యులుదాతల కుటుంబీకులను అశీర్వదించి ప్రసాదం అందజేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహనార్యాలీ



నవధాన్యాల సాగుపై అవగాహనార్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

నూజివీడు: రైతులు నవధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారిణి ఆలూరు చాముండేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని పడమర దిగవల్లిలో నవధాన్యాల పంటల సాగుపై పాఠశాల విద్యార్థులతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల్ని సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందని, భూమి గుల్లబడి వానపాములు అభివృద్ధి చెందుతాయన్నారు. భూమిలో కర్బన శాతం పెరగడమే కాకుండా, నీటి నిల్వ శాతం కూడా పెరుగుతుందన్నారు. ప్రకృతి సిద్ధంగా పండిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. నేల తల్లి బాగుకు రైతులందరూ నవధాన్యాలు సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారి రవికుమార్, ఐసీఆర్పీలు నాగమల్లేశ్వరరావు, వీహెచ్‌ఏ లీలావతి, వీఏఏ నాగుల్‌మీరా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఫోరం ఆవస్యకతపై సదస్సు

తిరువూరు: ఈసీఈ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సాంకేతిక అంశాలపై ఎప్పటికపుడు సమాచారం తెలుసుకోడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ స్టూడెంట్ ఫోరమ్‌లో సభ్యత్వం పొందాలని విజయవాడ ఐఈటీఈ చైర్మన్ రాజశేఖర్ సూచించారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐఈటీఈ స్టూడెంట్స్ ఫోరమ్ ఆవస్యకతపై ఈసీఈ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందడానికి, ఆన్‌లైన్ లైబ్రరీల ద్వారా తాజా సమాచారం తెలుసుకోడానికి ఈ సభ్యత్వం ఉపకరిస్తుందన్నారు. కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంటు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, ఏవో కిషోర్‌బాబు, ఈసీఈ విభాగాధిపతి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.